పైలట్‌ ప్రాజెక్టుకు కేంద్రం మోకాలడ్డు

- కేంద్రం నిధుల వాటా తగ్గింపు
- నిలిచిన పనులు
- తాగునీటి సమస్యతో ప్రజల ఇబ్బందులు
- ఎన్నికల్లో అసత్య ప్రచారం చేసిన టీడీపీ


తిరువూరులో నిలిచిన పైలట్‌ ప్రాజెక్టు ఓవర్‌హెడ్‌ ట్యాంకు పనులు

తిరువూరు: తిరువూరు పట్టణానికి కృష్ణా నదీ జలాలను తాగునీటి సరఫరా చేసే నిమిత్తం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పైలట్‌ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం మోకాలడ్డటంతో పనులు ప్రారంభమైన తదుపరి నిలిచిపోయాయి. రూ.140 కోట్లతో ఇబ్రహీంపట్నం సమీపంలోని ఫెర్రీ నుంచి పైపులైన్లు ఏర్పాటు చేసి తిరువూరుకు కృష్ణానదీ జలాలను అందించే బృహత్తర ప్రణాళికను తిరువూరు నగర పంచాయతీ పాలకవర్గం రూపొందించింది. రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి సంస్థ ఈ ప్రతిపాదనలను కేంద్రానికి పంపి ఆమోదింపజేసిన అనంతరం ఆషియన్‌ డెవలప్‌మెంట్‌ బ్యాంకు ద్వారా రుణం కూడా మంజూరైంది. నిర్మాణం పూర్తి చేసిన అనంతరం పట్టణ ప్రజలకు తాగునీరందించడంతో పాటు 15 సంవత్సరాల పాటు ఈ ప్రాజెక్టును నిర్వహించే బాధ్యత కాంట్రాక్టు సంస్థకు అప్పగించారు. అయితే తొలుత ఉన్న నిబంధనలను సవరిస్తూ కేంద్ర ప్రభుత్వం వాటా కింద ఇచ్చే నిధులను తగ్గించడంతో నిర్మాణ పనులు నిలిచిపోయాయి. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో తెలుగుదేశం పార్టీ ఈ పైలట్‌ ప్రాజెక్టు నిర్మాణంలో ప్రభుత్వం అలసత్వ వైఖరి అవలంబిస్తోందని ప్రచారం చేసింది.

ప్రారంభంలోనే నిలిచిన పనులు

గతంలో ఉన్న పైపులైన్లను తొలగించి కొత్తవి ఏర్పాటు చేయడానికి రాష్ట్ర పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ రూ.40 లక్షలు కేటాయించగా ఈ నిధులతో పలు ప్రాంతాల్లో పనులు పూర్తిచేశారు. అనంతరం కాంట్రాక్టర్‌కు పైలట్‌ ప్రాజెక్టు పనులు అప్పగించి, శాంతినగర్‌లో ఓవర్‌హెడ్‌ ట్యాంకుల నిర్మాణాన్ని చేపట్టారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో కాంట్రాక్టరు పనులను నిర్వహించడానికి వెనుకడుగు వేశారు. ప్రస్తుతం ట్యాంకుల నిర్మాణ పనులు ప్రారంభ దశలోనే ఉన్నాయి.

గత పాలకవర్గం నిర్లక్ష్యం..

తిరువూరు నగర పంచాయతీలో గత పాలకవర్గం ఈ పైలట్‌ ప్రాజెక్టుకు నిధులు మంజూరు చేయించడంలో తీవ్ర నిర్లక్ష్యం వహించడంతో అంచనా వ్యయం విపరీతంగా పెరిగిపోయింది. 2015లో ఈ ప్రాజెక్టు పనులను రూ.70 కోట్లతో నిర్వహించవచ్చని ఇంజినీరింగ్‌ అధికారులు అంచనా వేయగా, నిధులు మంజూరవకుండానే ఆర్భాటంగా శిలాఫలకం వేశారు. డీపీఆర్‌ తయారీకే సుమారు రూ.30 లక్షల వరకు ఖర్చు చేశారు. తదుపరి ప్రాజెక్టు పనులు అడుగు ముందుకు పడలేదు. 2019 అసెంబ్లీ ఎన్నికల్లో వైఎస్సార్‌ సీపీ ఇచ్చిన హామీ మేరకు ప్రాజెక్టుకు ఆమోదం తీసుకువచ్చి నిర్మాణ పనులు చేపట్టే తరుణంలో కేంద్రప్రభుత్వం నిబంధనల మార్పుతో మళ్లీ పరిస్థితి మొదటికి వచ్చింది.

అనుమతి కోసం ప్రయత్నిస్తున్నాం

తిరువూరు పట్టణ ప్రజల దాహార్తి తీర్చడానికి చిత్తశుద్ధితో కృషి చేస్తున్నాం. పైలట్‌ ప్రాజెక్టు నిర్మాణ పనులను తిరిగి ప్రారంభించేందుకు అనుమతుల కోసం ప్రయత్నిస్తున్నాం. ఎన్నికల నియమావళి ముగిసిన వెంటనే పనులు చేపట్టే అవకాశం ఉంది.

– గత్తం కస్తూరిబాయి, చైర్‌పర్సన్‌, తిరువూరు నగర పంచాయతీ

క్లుప్తంగా

గజలక్ష్మీ దేవికి జలాభిషేకం



మెట్టగుట్ట(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలను శివారు మెట్టగుట్టపై వేంచేసిన శేషాచల శ్రీనివాసస్వామి ఆలయంలో పౌర్ణమి సందర్భంగా గజలక్ష్మీ అమ్మవారికి గురువారం జలాభిషేకం నిర్వహించారు. ఖమ్మం జిల్లా మధిర పట్టణానికి చెందిన శ్రీనివాస భక్త బృందం మధిర సహకారంతో ఆలయ అర్చకులు యోగానంద ఆచార్యులు, శ్యామ సుందరాచార్యుల ఆధ్వర్యంలో అమ్మవారికి 108 బిందెలతో జలాభిషేకం జరిపారు. అనంతరం విశేష అర్చన, కైంకర్యాలు నిర్వహించారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

టెన్త్‌ సప్లిమెంటరీ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఆగిరిపల్లి: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం నుంచి ప్రారంభమవుతాయని ఎంఈఓ సర్వేశ్వరరావు తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ పరీక్షలకు మండలంలో 211 మంది విద్యార్థులు హాజరవుతారని, ఇందుకు సంబంధించి ఆగిరిపల్లి జిల్లా పరిషత్‌ ఉన్నత పాఠశాలలోని పరీక్ష కేంద్రంలో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని చెప్పారు. ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరుగుతాయని వివరించారు.

ముగిసిన నరసింహస్వామి జయంత్యుత్సవాలు



పెనుగొలను(గంపలగూడెం): పెనుగొలనులో విరాజిల్లుతున్న లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా జరుగుతున్న స్వామి వారి జయంతి ఉత్సవాలు గురువారం వైభవంగా ముగిశాయి. భక్తులచే స్వామివారికి 108 బిందెల జలంతో, పంచామృతాలు, నవఫల రసాలతో అభిషేకం జరిపారు. అనంతరం దీపోత్సవం, ప్రత్యేక భజన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడుగురు సుమంగళి స్త్రీలకు అమ్మవారి చీరలు అందజేశారు. ఆలయ కమిటీ కన్వీనర్‌ పరుచూరు హరిమాధవ గుప్తా ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దివ్యాంగురాలికి ట్రై సైకిల్‌ వితరణ



నూజివీడు: పట్టణంలోని పోతురెడ్డిపల్లి అడ్డరోడ్డు సమీపంలో నివసించే దివ్యాంగురాలు పెంద్ర వెంకటేశ్వరమ్మకి ఏపీసీపీడీసీఎల్‌ ఈఈ ఎ.సత్యనారాయణ గురువారం ట్రై సైకిల్‌ను వితరణగా అందించారు. వెంకటేశ్వరమ్మ నిరుపేద కుటుంబం కావడంతో కొనుక్కునే స్తోమత లేని నేపథ్యంలో ఈఈ స్పందించి సొంత సొమ్ముతో ట్రై సైకిల్‌ను కొనుగోలు చేసి ఆమెకు అందజేశారు. వెంకటేశ్వరమ్మ కుటుంబ సభ్యులు ఈఈకి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో టౌన్‌ డీఈ ఓలేటి దుర్గారావు, సిబ్బంది పాల్గొన్నారు.

కనులపండువగా వేణుగోపాలుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధి గాంచిన గంపలగూడెం మండలం నెమలి వేణుగోపాలస్వామి ఆలయంలో స్వామి వారి మాస కల్యాణం గురువారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులచే సత్యభామ రుక్మిణీదేవి సమేత వేణుగోపాలస్వామి కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. 19 మంది దంపతులు పీటలపై కూర్చుని కన్యాదానం చేశారు. కార్యనిర్వహణాధికారి జయప్రకాష్‌బాబు, భక్తులు పాల్గొన్నారు.

అన్నసమారాధన

విస్సన్నపేట: పౌర్ణమి సందర్భంగా స్థానిక షిర్డీ సాయి సేవా మందిరంలో, పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. వీరబ్రహ్మేంద్రస్వామి అన్నప్రసాద సేవా సమితి ఆధ్వర్యంలో అన్నసమారాధన నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకుడు దాగం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

రియాక్టర్‌ పేలిన ఘటనలో మృతుడు కృష్ణారావుపాలెం వాసి

చాట్రాయి: చౌటప్పల్‌లోని ఎస్‌వీ ల్యాబ్‌లో బుధవారం రాత్రి రియాక్టర్‌ పేలిన ఘటనలో మండలంలోని కృష్ణారావుపాలెం గ్రామానికి చెందిన కె.నాగరాజు (45) మృతిచెందాడు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. మృతుడు నాలుగేళ్లుగా ల్యాబ్‌లో షిఫ్ట్‌ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. ఈ ఘటనతో మృతుడు నివశించే కాలనీలో విషాద ఛాయలు అలముకున్నాయి.

స్ట్రాంగ్‌ రూమ్‌ వద్ద భద్రతను పరిశీలించిన ఆర్డీఓ


స్ట్రాంగ్‌ రూమ్‌ను పరిశీలిస్తున్న ఆర్డీఓ భవానీశంకరి

నూజివీడు: నియోజకవర్గ ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌ రూమ్‌ వద్ద భద్రతను నూజివీడు ఆర్డీఓ, నూజివీడు నియోజకవర్గ రిటర్నింగ్‌ అధికారి వై.భవానీశంకరి గురువారం పరిశీలించారు. ఏలూరులోని సర్‌ సీఆర్‌ఆర్‌ ఇంజినీరింగ్‌ కళాశాలలో ఏర్పాటు చేసిన ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్‌ రూమ్‌లను అధికారులతో కలిసి ఆర్డీఓ పరిశీలించారు. తలుపులకు వేసిన తాళాలను, తాళాలకున్న సీళ్లను క్షుణ్ణంగా పరిశీలించారు. అన్ని చోట్లా సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈవీఎం కంట్రోల్‌ రూంను కూడా పరిశీలించారు. ఈ సందర్భంగా భవానీశంకరి మాట్లాడుతూ ఈవీఎంల భద్రత విషయంలో అనుక్షణం అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈవీఎంలకు ప్రభుత్వం మూడు అంచెల భద్రత కల్పించిందన్నారు. మూడంచెల భద్రతను ఆర్డీఓ పరిశీలించారు. ఇక్కడి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలన్నారు. అనధికార వ్యక్తులను స్ట్రాంగ్‌ రూం ఉన్న ప్రాంతంలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించరాదని చెప్పారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

నూజివీడులో ఆర్టీసీ పెట్రోల్‌ బంకు ప్రారంభం

నూజివీడు: పట్టణంలోని బస్టాండ్‌ వద్ద ఆర్టీసీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన పెట్రోల్‌ బంకును గురువారం ప్రారంభించామని డీఎం సీహెచ్‌ఎస్‌ పవన్‌కుమార్‌ తెలిపారు. ఈ సందర్భంగా డీఎం మాట్లాడుతూ ప్రభుత్వం నిర్దేశించిన ధరలకు నాణ్యమైన పెట్రోల్‌, డీజిల్‌ను విక్రయిస్తామని, పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఘనంగా లక్ష్మీనరసింహ స్వామి కల్యాణం


చనుబండలో స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న పురోహితులు

చాట్రాయి: చనుబండ గ్రామం కురుమ యాదవ కాలనీలో లక్ష్మీనరసింహస్వామి వారి కల్యాణం బుధవారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేలాది మంది భక్తులు తరలివచ్చి స్వామి వారికి పూజలు చేశారు. గురువారం కురుమ సంఘం ఆధ్వర్యంలో రెండు వేల మందికి అన్నదానం చేశారు.

పుస్తక పఠనంతో భాషపై పట్టు


మైలవరం శాఖా గ్రంథాలయంలో పుస్తక పఠనంలో పాల్గొన్న విద్యార్థులు

మైలవరం: పుస్తక పఠనంతో భాషపై పట్టు పెరుగుతుందని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు డీవీఎస్‌ ప్రసాద్‌ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా మైలవరం శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో గురువారం విద్యార్థులచే నీతి కథలు చదివించి, వారిచే నీతి కథలు చెప్పించారు. ఆయన మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, పుస్తక పఠనం వలన మేధస్సు పెరుగుతుందని చెప్పారు. టీవీలు, సెల్‌ఫోన్లకు అలవాటు పడకుండా ప్రతి విద్యార్థి గ్రంథాలయాలకు వచ్చేట్లుగా తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రోత్సహించాలని సూచించారు. కార్యక్రమంలో గ్రంథాలయాధికారి జె.నాగార్జున, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లలను భవిత కేంద్రాల్లో చేర్పించాలి


సీడబ్ల్యూఎస్‌ఎన్‌ పిల్లలను గుర్తిస్తున్న వెంకటేశ్వరరావు, సోమశేఖర్‌

భవానీపురం(విజయవాడపశ్చిమ): ప్రత్యేక అవసరాలు కలిగిన పిల్లలను బడిలో చేర్పించడానికి నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని జిల్లా సహిత విద్యా సమన్వయకర్త ఎల్‌. వెంకటేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారి సోమశేఖర్‌ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రత్యేక అవసరాలు కలిగిన చిన్నారుల ఇళ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చిల్డ్రన్స్‌ విత్‌ స్పెషల్‌ నీడ్స్‌ (సీడబ్ల్యూఎస్‌ఎన్‌) పిల్లలను ఎలా గుర్తించాలో వివరించారు. 21 రకాల వైకల్యాలు ఉన్న పిల్లలను గుర్తించి సమీప భవిత కేంద్రాల్లోగానీ లేకపోతే వారికి దగ్గరలో ఉన్న పాఠశాలల్లో కానీ చేర్పించాలన్నారు. ఇప్పటికే పశ్చిమ మండలంలో కొత్తగా ఏర్పాటు చేసిన ప్రత్యేక వనరుల కేంద్రంలో 10 మంది విద్యార్థులు ఉన్నారని చెప్పారు. బడి బాట కార్యక్రమం ద్వారా మరో 12 మందిని గుర్తించారని తెలిపారు. నాణ్యమైన విద్య, సంక్షేమ పథకాల ఫలాలు అందుకునేందుకు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. కార్యక్రమంలో ఐఈఆర్‌ టీచర్స్‌ సింధు, తేజస్వి పాల్గొన్నారు.

అయోధ్య రామిరెడ్డిని కలిసిన తిరుపతిరావు



మైలవరం: వైఎస్సార్‌ సీపీ సీనియర్‌ నాయకులు, ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాల రీజినల్‌ కో–ఆర్డినేటర్‌ అయోధ్య రామిరెడ్డిని మైలవరం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మంగళగిరి పార్టీ కేంద్ర కార్యాలయంలో గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎన్టీఆర్‌ జిల్లా ఇన్‌చార్జి మర్రి రాజశేఖర్‌ను కూడా ఆయన కలిశారు. పలు అంశాలపై వారు చర్చించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌ సీపీ మైలవరం నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికట్టాలి

చాట్రాయి: రుతుక్రమంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నూజివీడు చైల్డ్‌ డెవలప్‌మెంట్‌ అధికారి డి.నాగేశ్వరి అన్నారు. గురువారం మండలంలోని బూరుగుగూడెం గ్రామంలో నిర్వహించిన మాసికా మహోత్సవ్‌ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను అరికట్టాలని, వాటి వలన పలు రకాల నష్టాలు, ఆరోగ్య సమస్యలు ఏర్పడతాయన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్‌ సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కాలినడకన స్వామి సన్నిధికి

గంపలగూడెం: గంపలగూడెం వీరాంజనేయస్వామి భక్త మండలి ఆధ్వర్యంలో గంపలగూడెం రామాలయం నుంచి మేడూరు వీరాంజనేయస్వామి ఆలయం వరకు ఆరు కిలోమీటర్ల దూరం భక్తులు పాదయాత్ర జరిపారు. స్వామి జెండాలను చేబూని జై హనుమాన్‌, జై శ్రీరామ్‌ అంటూ నినాదాలు చేస్తూ పాదయాత్రలో భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. భక్తమండలి ఆధ్వర్యంలో నిర్ణయించిన 109 పాదయాత్రలలో భాగంగా 11వ పాదయాత్రను గురువారం భక్తులు కొనసాగించారు. ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిపారు.

రామిశెట్టి వేణుగోపాలరావుకు నివాళి



ఊటుకూరు(గంపలగూడెం): సీపీఐ నాయకుడు రామిశెట్టి వేణుగోపాలరావు వర్ధంతి కార్యక్రమం ఊటుకూరు భూపేష్‌ గుప్తా భవన్‌లో గురువారం నిర్వహించారు. తొలుత ఆయన విగ్రహానికి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. నియోజకవర్గ కమిటీ సభ్యుడు సిద్ధి కొండలరావు అధ్యక్షతన జరిగిన సభలో సీపీఐ ఎన్టీఆర్‌ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్‌ మాట్లాడుతూ వేణుగోపాలరావు సేవలను కొనియాడారు. పరిసర ప్రాంతాల్లో జరిగిన ఉద్యమాల్లో పాల్గొని వేలాది ఎకరాల భూములను పేదలకు దక్కేందుకు పోరాటాలు నిర్వహించారని గుర్తు చేశారు. నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

చిన్నంపేటలో తగ్గుతున్న జ్వరాలు


చిన్నంపేటలో వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న డాక్టర్‌ నరేంద్ర

చాట్రాయి: మండలంలోని చిన్నంపేట గ్రామంలో జ్వరాలు తగ్గుతున్నాయని ఏలూరు జిల్లా సర్వైలెన్స్‌ అధికారి డాక్టర్‌ నరేంద్ర తెలిపారు. గురువారం మండలంలోని చిన్నంపేట గ్రామంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరాన్ని ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ గ్రామంలో ఇటీవల ప్రజలు జ్వరాల బారినపడ్డారని, అన్నిరకాల వైద్య పరీక్షలు చేశామని చెప్పారు. గ్రామంలో నీటి నమూనాలను సేకరించి ల్యాబ్‌ పరీక్షలకు పంపించగా ఒక వాటర్‌ ప్లాంట్‌లో సరఫరా చేసే వాటర్‌లో తాగునీటిలో కొన్ని లోపాలను గుర్తించామని, ఆ వాటర్‌ ప్లాంట్‌ని మూసివేయించామన్నారు. జ్వరాలు వచ్చి తగ్గిన వారికి నొప్పులు, వాపులు ఇంకా తగ్గలేదని, వారి రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం పంపామని, రిపోర్టులు వచ్చిన తరువాత వారికి తగిన వైద్య సేవలందిస్తామన్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేస్తున్నారని చెప్పారు. కార్యక్రమంలో చనుబండ పీహెచ్‌సీ వైద్యులు దుర్గాప్రసాద్‌, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

పాల ఉత్పత్తిని పెంచాలి

కృష్ణా మిల్క్‌ యూనియన్‌ చైర్మన్‌ ఆంజనేయులు


కేక్‌ కట్‌ చేస్తున్న ఆంజనేయులు

కొత్తగూడెం(మైలవరం): పాల ఉత్పత్తిదారులకు కృష్ణా మిల్క్‌ యూనియన్‌ ద్వారా అందుతున్న సేవలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని యూనియన్‌ చైర్మన్‌ చలసాని ఆంజనేయులు అన్నారు. మైలవరం మండలం కొత్తగూడెం పాల ఉత్పత్తిదారుల సహకార సంఘం కార్యాలయంలో చలసాని ఆంజనేయులు యూనియన్‌ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించి ఐదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆయనను సొసైటీ సభ్యులు గురువారం ఘనంగా సన్మానించారు. ఆంజనేయులు మాట్లాడుతూ పాల రైతులు పాల ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. పశువులకు కావాల్సిన దాణా, మందులు, గడ్డి తదితరాలను యూనియన్‌ అందజేస్తోందని చెప్పారు. సంచార పశు వైద్యశాల గ్రామాలకే వచ్చి పశువులకు వైద్య సేవలు అందిస్తోందన్నారు. కార్యక్రమంలో మైలవరం క్లస్టర్‌ మేనేజర్‌ టి. యశ్వంత్‌, సొసైటీ అధ్యక్షుడు సాంబిరెడ్డి, వేతన కార్యదర్శి, సూపర్‌వైజర్లు, పాల రైతులు పాల్గొన్నారు.

మద్దిరావమ్మకు ప్రత్యేక పూజలు



చెక్కపల్లిలో అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

చెక్కపల్లి (ముసునూరు): గ్రామ దేవత మద్దిరావమ్మ తల్లి గ్రామోత్సవం వైభవంగా నిర్వహించారు. చెక్కపల్లిలోని గ్రామదేవత మద్దిరావమ్మ తల్లి చెంతకు గురువారం గ్రామ పెద్దలు, ఆడపడుచులు, భక్తులు, పిల్లలు తరలివెళ్లారు. ముందుగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అమ్మవారి ఉత్సవ విగ్రహాలకు అభిషేకాలు నిర్వహించారు. అనంతరం చీర, సారె, పసుపు కుంకుమ, గాజులు సమర్పించారు. అత్యంత భక్తిశ్రద్ధలతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానిక భక్తులు ప్రదర్శించిన కోలాట భజన ఆకట్టుకుంది. అనంతరం కమిటీ పెద్దల ఆధ్వర్యంలో భక్తులకు అన్నసంతర్పణ చేశారు.

పెనుగొలనులో తాబేళ్ల దినోత్సవం

పెనుగొలను(గంపలగూడెం): గంపలగూడెం మండలం పెనుగొలనులో గురువారం షిర్డీ సాయిబాబాబ సేవా కమిటీ ఆధ్వర్యంలో తాబేళ్ల దినోత్సవం నిర్వహించారు. తాబేలు చిత్ర పటానికి పూలమాలంవేసి పూజలు జరిపారు. ప్రతి సంవత్సరం మే 23న ప్రపంచ వ్యాప్తంగా తాబేలు దినోత్సవం నిర్వహిస్తారని కమిటీ సభ్యులు నారాయణరావు తెలిపారు. తాబేళ్ల మనుగడపై దృష్టి సారించేందుకు, వాటిని సంరక్షించేలా ప్రోత్సహించేందుకు ఈ దినోత్సవం జరుపుకుంటామన్నారు. పలువురు మహిళలు పాల్గొన్నారు.

పచ్చిరొట్ట విత్తనాలతో భూములు సారవంతం


తుక్కులూరులో రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న ఏడీఏ విద్యాసాగర్‌


ముసునూరులో పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ చేస్తున్న వ్యవసాయాధికారి

నూజివీడు: రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందజేస్తున్న పచ్చిరొట్ట విత్తనాలను రైతులు తీసుకుని సాగు చేయడం ద్వారా వ్యవసాయ భూములు సారవంతంగా మారుతాయని, ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని నూజివీడు ఏడీఏ జి. విద్యాసాగర్‌ అన్నారు. మండలంలోని తుక్కులూరు రైతు భరోసా కేంద్రంలో గురువారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని ఏడీఏ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీలుగ, జనుము, పిల్లిపెసర విత్తనాలు రైతుభరోసా కేంద్రాల్లో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు తమ భూమికి సంబంధించిన పాసుపుస్తకం, రైతు ఆధార్‌కార్డు జిరాక్స్‌ తీసుకువచ్చి విత్తనాలను రాయితీపై పొందవచ్చన్నారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి ఆలూరు చాముండేశ్వరి, వీహెచ్‌ఏ శీలం చంటి, రైతులు పాల్గొన్నారు.

రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు పంపిణీ

ఆగిరిపల్లి: మండలంలో పచ్చిరొట్ట విత్తనాలు కావాల్సిన రైతులు తమ గ్రామాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని ఆగిరిపల్లి మండల వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు అన్నారు. స్థానిక మండల వ్యవసాయాధికారి కార్యాలయంలో గురువారం పచ్చిరొట్ట విత్తనాల పంపిణీని మండల వ్యవసాయ అధికారి పల్లగాని చెన్నారావు, ఉద్యాన శాఖ అధికారి జ్యోతి ప్రియాంక ప్రారంభించారు. జనుము, జీలుగ, పిల్లిపెసర విత్తనాలను 50 శాతం సబ్సిడీపై రైతులకు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. మండలంలో రైతు భరోసా కేంద్రంలో జీలుగ విత్తనాలు 100, పిల్లిపెసర విత్తనాలు 50, జనుము విత్తనాలు 30 క్వింటాళ్లు పంపిణీకి సిద్ధంగా ఉన్నాయన్నారు.

ముసునూరు: పచ్చిరొట్ట ఎరువుల విత్తనాలను వినియోగించి, రైతులు తమ పొలాల్లో భూసారాన్ని పెంచుకోవాలని వ్యవసాయాధికారి సందిపాము మధుమోహన్‌ అన్నారు. గురువారం అన్ని గ్రామాల్లోని వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాల వద్ద పచ్చిరొట్ట ఎరువుల విత్తనాల పంపిణీని ప్రారంభించి మాట్లాడారు. జీలుగ 160 క్వింటాళ్లు, జనుము 100 క్వింటాళ్లు, పిల్లిపెసర 70 క్వింటాళ్ల విత్తనాలు అందుబాటులో ఉన్నాయన్నారు. విత్తనాలను 50 శాతం రాయితీతో ప్రతి గ్రామంలోని వైఎస్సార్‌ రైతు భరోసా కేంద్రాల ద్వారా పొందాలన్నారు. కార్యక్రమాల్లో వ్యవసాయ, ఉద్యాన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల చెంతకు తప్పిపోయిన బాలుడు



తిరువూరు: చిత్తూరు జిల్లా రేణిగుంట నుంచి ఈ నెల 17న తిరువూరుకు చేరుకున్న బాలుడిని గురువారం అతని తల్లిదండ్రులకు అప్పగించామని తిరువూరు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు. ఖమ్మం జిల్లా కల్లూరు మండలం కృష్ణాపురంలో మామిడితోట కాపలాదారులుగా ఉన్న తన తల్లిదండ్రుల వద్దకు వెళ్లేందుకు రేణిగుంట నుంచి బయల్దేరిన నాగరాజు వారి చిరునామా తెలియక విజయవాడ మీదుగా తిరువూరు చేరాడు. తిరువూరు బస్టాండ్‌లో అతనిని గుర్తించిన పోలీసులు పరిపూర్ణ సేవాశ్రమంలో చేర్చారు. తదనంతరం బాలుడి తల్లిదండ్రుల ఆచూకీకై ప్రయత్నించగా, జీవనోపాధి నిమిత్తం రేణిగుంట నుంచి కృష్ణాపురం వచ్చినట్లు నిర్ధారించుకుని వారిని తిరువూరు స్టేషన్‌కు రప్పించి కౌన్సెలింగ్‌ ఇచ్చారు. అనంతరం నాగరాజును అప్పగించారు. పరిపూర్ణ సేవాశ్రమ నిర్వాహకుడు సిరికొండ నాగేశ్వరరావు పాల్గొన్నారు.